# సాక్షి నిర్మల్

గురువారం • 7 • ఆగస్టు • 2025






## భోరజ్ అక్రమాలకు 'చెక్'!

భోరజ్ సమీకృత చెక్‌పోస్టు ఎత్తివేతకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. అవినీతి, అక్రమాలపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలోనే ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. 8లో▸



## రాఖీ సందడి షురూ..

జిల్లాలో రాఖీ సందడి ప్రారంభమైంది. శనివారం రాఖీ పౌర్ణమి కావడంతో జిల్లాకేంద్రంలోని మార్కెట్లు, రహదారుల వెంట అధిక సంఖ్యలో దుకాణాలు వెలిశాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.0 /25.0

## వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా భారీ వర్షం కురిసే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### 'ఇందిరమ్మ' నిర్మాణాల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ రూరల్:** మండలంలోని రత్నాపూర్ కాండ్లిలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను బుధవారం కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి పనుల పురోగతి గురించి తెలుసుకున్నారు. పనులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో గజానన్ పాల్గొన్నారు.

### తల్లిపాలే బిడ్డలకు శ్రేయస్కరం



పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

**కుంటాల:** తల్లిపాలే బిడ్డలకు శ్రేయస్కరమని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పుట్టిన బిడ్డలకు ముర్రుపాలు పట్టిస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం కుంటాల, ఓలా ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తహసీల్దార్ కమల్‌సింగ్, ఎంపీడీవో వనజ, ఎంఈవో ముత్యం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

### మెరుగైన వైద్యసేవలందించాలి

**లోకేశ్వరం:** వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలందించాలని జిల్లా వైద్యాధికారి రాజేందర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే డెలివరీ అయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట లోకేశ్వరం వైద్యాధికారి శైలజ, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

### 'ఆధార్' అప్‌డేట్ లేదని..
### మహాలక్ష్మి పథకం వర్తించదని..

- మహిళలను బస్సు దించిన కండక్టర్



దేగాం వద్ద కండక్టర్ బస్సు దింపగా ఆధార్‌కార్డులు చూపిస్తున్న మహిళలు

**భైంసారూరల్:** ఆధార్‌కార్డులు అప్‌డేట్ చేసుకోనందున మహాలక్ష్మి పథకం వర్తించదని ఆర్టీసీ కండక్టర్ మహిళలను మధ్యలోనే బస్సు దించేశారు. వివరాలు.. నిజామాబాద్ డిపోకు చెందిన బస్సులో బుధవారం భైంసాలో కొందరు మహిళలు ఎక్కారు. వారి ఆధార్‌కార్డుల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అని ఉండగా అవి చెల్లవంటూ కండక్టర్ వారిని దేగాం వద్దే దింపేశారు. దీంతో మహిళలు కండక్టర్‌తో గొడవకు దిగారు. ప్రతీసారి ఇదే కార్డుపై ప్రయాణిస్తున్నామని తెలిపారు. ఆధార్ అప్డేట్ ఉంటే తీసుకువెళ్తానని కండక్టర్ చెప్పినా వినిపించుకోలేదు. దీంతో అరగంట సేపు బస్సు అక్కడే ఆగిపోయింది. తర్వాత భైంసా డిపో బస్సు రాగా వారు అందులో ఎక్కి వెళ్లిపోయారు. దీనిపై డిపో మేనేజర్‌ను వివరణ కోరగా సంస్థ ఎండీ ఆదేశాల ప్రకారమే నడుచుకుంటున్నామని పేర్కొన్నారు.

### భక్తిశ్రద్ధలతో ప్రదోష పూజలు



కావడి కుండలతో ఆలయంలో మహిళలు

**భైంసాటౌన్:** పట్టణంలోని బ్రాహ్మణగల్లిలో మహిళలు బుధవారం భక్తి శ్రద్ధలతో ప్రదోష పూజలు నిర్వహించారు. స్థానిక పురాణాబజార్, బ్రాహ్మణగల్లి మహిళలు అధికసంఖ్యలో ఇళ్ల నుంచి కావడి కుండల్లో జలాలు తీసుకుని స్థానిక నాగేశ్వరాలయానికి చేరుకున్నారు. శివలింగానికి జలంతో అభిషేకం చేశారు. ఈ పూజలు చేయడం ద్వారా సుఖఃసంతోషాలు కలుగుతాయని, ఏడాదంతా పూజలు చేసిన ఫలం దక్కుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.





నిర్మల్‌లోని కాకతీయ యూనివర్సిటీ పీజీసెంటర్

# వసతులున్నా.. వర్సిటీ ఇవ్వరా?

- సరస్వతీ కొలువైనా జిల్లాపై చిన్నచూపా?
- విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసేదెప్పుడు?
- ఉద్యమదిశగా విద్యావంతులు, సంఘాలు
- నేడు 'సాక్షి' ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అన్ని వర్గాలతో రౌండ్‌టేబుల్ సమావేశం

**నిర్మల్:** చదువుల తల్లే కొలువుదీరిన జిల్లా. గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఎదిగిన నేతలున్న ఖిల్లా. ఉమ్మడి జిల్లాకే రాజకీయకేంద్రంగా పేరున్న నిమ్మల. ఇలా.. అన్నీ ఉన్నా.. చదువుల్లో మాత్రం సున్నా చుడుతోంది. దశాబ్దాలు గడిచిపోతున్నా.. ఉన్నతవిద్య అందని ద్రాక్షే అవుతోంది. విశ్వవిద్యాలయం పెడతామని పాలకులు హామీలిచ్చినా.. హైదరాబాద్–ఢిల్లీ మధ్య సంబంధిత ఫైళ్లు తిరుగుతున్నా.. అడుగు ముందుకుపడటం లేదు. అడిగేవారు లేకనే.. జిల్లాపై పాలకులు, అధికారులు చిన్నచూపు చూస్తున్నారనే వాదనా జిల్లావాసుల్లో పెరుగుతోంది.

**హామీలిచ్చి ఏళ్లు గడుస్తున్నా..**

అక్షరక్రమంలో ముందున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను విద్యారంగంలోనూ ముందంజలో ఉంచుతామంటూ.. ప్రతీ పాలకుడూ చెబుతూనే వస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పటి నుంచే విశ్వవిద్యాలయం ఏర్పాటు ప్రతిపాదనలున్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా మాజీ సీఎం కేసీఆర్,





నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఈ ప్రాంతానికి వచ్చిన ప్రతిసారీ యూనివర్సిటీ ఏర్పాటు హామీ ఇస్తూ పోయారు. అప్పటికప్పుడు ప్రతిపాదనలు తీసుకుంటూ ఫైళ్లకు ఫైళ్లు తయారు చేయిస్తూనే ఉన్నారు. రాష్ట్రం నుంచి కేంద్ర మానవ వనరుల శాఖ (ఎంహెచ్‌ఆర్‌డీ)కి పంపుతున్నామని చెబుతూనే ఉన్నారు. కానీ.. ఇప్పటికీ యూనివర్సిటీ ఏర్పాటు దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కనీసం దాని గురించి ఆలోచన కూడా చేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**తల్లి ఉన్నా.. చదువు సున్నా..**

దేశంలోనే ప్రసిద్ధ చదువులక్షేత్రం బాసర జ్ఞానసరస్వతీమాత కొలువైన చోటనే సరైన విద్య లేకపోవడం దారుణం. చదువులమ్మ చెంతనే ఆర్జీయూకేటీ ఉన్నా.. జిల్లా విద్యార్థులకు ఆశించిన స్థాయిలో ప్రయోజనం చేకూరడం లేదు. పదోతరగతిలో వచ్చే మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపులు ఉండటంతో స్థానిక విద్యార్థులకు న్యాయం జరగడం లేదు. ఉన్న ఒక్క పీజీ సెంటర్‌నూ నామ్‌కే వాస్తేగా మార్చేశారు. డిగ్రీ కాలేజీల్లోనూ ఇప్పటికీ సంప్రదాయ కోర్సులే గాని.. ఒక్కటంటే ఒక్క ప్రత్యేక కోర్సు పెట్టడం లేదు. ఇక ఇంజినీరింగ్ కాలేజీ కావాలి ప్రభో.. అని ఏళ్లుగా వేడుకుంటున్నా.. కనికరించడం లేదు. అందరికీ అక్షరాభ్యాసం చేయించే చదువులమ్మ ఉన్న చోటనే.. సరైన చదువుల వ్యవస్థలు లేకపోవడం అత్యంత దారుణం.

**అన్ని వసతులున్నా..**

ప్రభుత్వం యూనివర్సిటీ పెట్టడంలో జాప్యం చేయడానికి కారణాలు తెలియడం లేదు. నిర్మల్‌లో ప్రస్తుతం ఉన్న డిగ్రీ కాలేజీ, పీజీసెంటర్, రెండు ఇంటర్ కాలేజీలకు కలిపి 40ఎకరాల భూమి ఉంది. డిగ్రీ కాలేజీకే భవనంతో పాటు 16ఎకరాల వరకు ఉంది. యూనివర్సిటీని ఏర్పాటు చేస్తే తాత్కాలికంగా తరగతులు నిర్వహించేందుకు సరిపడా భవనాలున్నాయి. స్థానికంగా సరైన విద్యావ్యవస్థలు లేక వేలాదిమంది విద్యార్థులు ఇప్పటికీ హైదరాబాద్ వరకూ వెళ్తున్నారు. నిర్మల్ ప్రాంతం ఆదిలాబాద్ జిల్లాకే కాకుండా నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాలకూ అందుబాటులో ఉంటుంది. 44, 61 నేషనల్ హైవేలున్నాయి. తాజాగా హైదరాబాద్–ఆదిలాబాద్ వయా నిర్మల్ రైల్వేలైన్‌కు సంబంధించి కూడా రైల్వేశాఖ డీపీఆర్ సిద్ధం చేస్తోంది.

### నేడు 'సాక్షి' రౌండ్‌టేబుల్ సమావేశం

చదువులతల్లి కొలువైన జిల్లాలో ఉన్నత విద్యపై పాలకులు చిన్నచూపు చూస్తున్నారనే వాదన పెరుగుతోంది. ప్రధానంగా పీజీసెంటర్‌పై నిర్లక్ష్యం, యూనివర్సిటీ సాధనకు సంబంధించిన అంశాలపై చర్చ కొనసాగుతోంది. 'అడగనిదే అమ్మ అయినా అన్నం పెట్టదు..' అన్న సామెతనే ఉందని, అడిగితే గానీ యూనివర్సిటీ ఇవ్వరని జిల్లావాసుల్లో చర్చ మొదలైంది. 'జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు..' అంటూ ప్రశ్నించేవారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఇటీవల జిల్లాలో ఉన్నతవిద్యపై 'సాక్షి' వరుస కథనాలను ప్రచురిస్తోంది. దీంతో ప్రధానంగా విద్యావంతులు, టీచర్లు, అధ్యాపకులు, విద్యార్థి సంఘాలు వర్సిటీ సాధనకు తమవంతు ప్రయత్నం మొదలు పెట్టాలని చర్చిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'సాక్షి మీడియా' ఆధ్వర్యంలో విద్యావంతులు, విద్యార్థి, టీచర్స్, అధ్యాపక, ఉద్యోగ, రిటైర్డ్ ఉద్యోగ సంఘాల నేతలతో జిల్లాకేంద్రంలోని పాత ఎమ్మార్వో భవనం వద్ద గల పెన్షనర్స్ భవన్ (విశ్రాంత ఉద్యోగుల సంఘం)లో గురువారం సాయంత్రం 5గంటలకు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తోంది.

# రాఖీకి ఆర్టీసీ సిద్ధం

- పండుగల నేపథ్యంలో ప్రత్యేక బస్సులు
- రాఖీల బుకింగ్ కోసం స్పెషల్ కౌంటర్లు

**ఆదిలాబాద్:** రాఖీ పండుగతో పాటు వరలక్ష్మీ వ్రతం వరుస సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ పెరగనుంది. ఈ మేరకు ఆర్టీసీ ముందస్తు చర్యలు చేపట్టింది. రీజియన్ పరిధిలో ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధమైంది. పండుగ సందర్భంగా అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీ కట్టేందుకు పుట్టింటికి వెళ్తారు. మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుంచి మహిళలు అధికసంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. అలాగే వరుస సెలవుల దృష్ట్యా ఉద్యోగులు, కుటుంబాలతో ఇతర ప్రదేశాలకు వెళ్తుంటారు. ఈ కారణంగా రద్దీ ఉండడంతో ఆర్టీసీ స్పెషల్ బస్సుల ఏర్పాట్లు చేపట్టింది.

**118 ప్రత్యేక బస్సులు**

ఈనెల 8న వరలక్ష్మీవ్రతం, 9న రాఖీ పౌర్ణమి, 10న ఆదివారం కావడంతో వరుసగా మూడు రోజుల పాటు సెలవులు వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 7, 8 తేదీల్లో హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఆదిలాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు 46 ప్రత్యేక బస్సులు వేశారు. అలాగే 10, 11, 12 తేదీల్లో ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భైంసా, మంచిర్యాల, నిర్మల్, ఉట్నూర్ డిపోల నుంచి హైదరాబాద్‌కు 72 బస్సులు నడపనున్నారు. రద్దీ ఎక్కువగా ఉంటే అదనంగా మరిన్ని సర్వీసులు నడిపేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.



రాఖీ బుకింగ్ కౌంటర్

### ముందస్తు రిజర్వేషన్ ఇలా..

పండుగల దృష్ట్యా ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవాలనుకునే వారి కోసం రిజర్వేషన్ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే www. tgsrtcbus. in వెబ్‌సైట్ ద్వారా బస్సుల సీట్లను బుక్ చేసుకోవచ్చు. డిమాండ్ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున వీలైనంత త్వరగా బుకింగ్ చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు.

### రద్దీకి అనుగుణంగా బస్సులు



వరలక్ష్మీవ్రతం, రాఖీ పౌర్ణమిని దృష్టిలో ఉంచుకొని ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 118 ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్‌లోని జేబీఎస్, ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ప్రధాన బస్‌స్టేషన్లలో 'మే ఐ హెల్ప్ యూ' సేవా కేంద్రాలు ఏర్పాటు చేశాం. రీజియన్ పరిధిలోని బస్‌స్టేషన్ల నుంచి పలు గ్రామాలకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతాం.

– ఎస్.భవానీప్రసాద్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, ఆదిలాబాద్

### అందుబాటులో రాఖీ బుకింగ్ కౌంటర్లు

పండుగకు సొంత గ్రామాలకు వెళ్లలేని మహిళలు తమ సోదరులకు రాఖీలను బుక్ చేసి పంపించే విధంగా ఆర్టీసీ ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసింది. రీజియన్ పరిధిలో మూడు బస్టాండ్లు, 26 ఏజెంట్ కౌంటర్లలో ఈ సేవలు ఇప్పటికే ప్రారంభించారు. ఇందులో రాఖీలతో పాటు మిఠాయిలు కూడా పంపించుకునే వెసులుబాటు కల్పించారు. బుకింగ్‌లో ఏవైన సమస్యలు, ఫిర్యాదులు ఉంటే వినియోగదారులు ఆదిలాబాద్, ఉట్నూర్ ఆర్టీసీ డిపోల పరిధిలో సెల్ నంబర్ 9154298531, నిర్మల్, భైంసా డిపోల పరిధిలో 9154298547, ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోల పరిధిలో 9154298541, రీజినల్ మేనేజర్ కార్యాలయం సెల్ నంబర్ 9154298553లో సంప్రదించాలని కరీంనగర్ జోన్ కార్గో మేనేజర్ వెంకటనారాయణ సూచించారు.

# నైపుణ్యాలు పెంపొందేలా బోధించాలి



నిర్మల్ రూరల్: మొక్క నాటుతున్న అభిలాష అభినవ్

**నిర్మల్ రూరల్:** విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందేలా బోధన కొనసాగించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. బుధవారం మండలంలోని రత్నాపూర్‌కాండ్లి జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. తరగతులు పరిశీలించారు. విద్యార్థుల హాజరు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల సరఫరాపై ఆరా తీశారు. విద్యార్థుల గణిత సామర్థ్యాలను పరీక్షించారు. ఉత్తమ ఫలితాల సాధనకు సన్నద్ధం కావాలని పదో తరగతి విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు రూపొందించిన భారతదేశ భౌగోళిక పటాన్ని చూసి అభినందించారు. మధ్యాహ్న భోజన ఏర్పాట్లు పరిశీలించి విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించారు. ఆరోతరగతి విద్యార్థిని అక్షయ స్వయంగా గీసి అందించిన తన ఫొటోను చూసి కలెక్టర్ ఆమెను అభినందించారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కిచెన్ గార్డెన్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి కూరగాయల విత్తనాలు నాటారు. డీఈవో రామారావు, తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో గజానన్, ఎంఈవో వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

**భూభారతి దరఖాస్తులు పరిష్కరించాలి**

**నిర్మల్‌చైన్‌గేట్:** భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. దరఖాస్తులు తిరస్కరణకు గురైతే కారణాలు తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. సీఎంఆర్ డెలివరీని సకాలంలో పూర్తి చేయని మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించాలని, సదరు మిల్లర్ల ఆస్తులు స్వాధీనం చేసుకునేందుకూ వెనుకాడవద్దని తెలిపారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, ఏడీ సర్వే ల్యాండ్ రికార్డ్ సుదర్శన్, పీడీ హౌసింగ్ రాజేశ్వర్, తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



నిర్మల్‌చైన్‌గేట్: నివాళులర్పిస్తున్న అభిలాష అభినవ్



బాసర: నివాళులర్పిస్తున్న గోవర్ధన్, అధికారులు

**నిర్మల్‌చైన్‌గేట్:** తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ ఆశయ సాధనకు కృషి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ చేసిన కృషిని కొనియాడారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్, సీపీవో జీవరత్నం, బీసీ సంక్షేమాధికారి శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, ఏవో సూర్యారావు, డీవైఈవో పరశురాం, మెప్మా పీడీ సుభాష్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

**బాసర:** బాసర ఆర్జీయూకేటీలో జయశంకర్ చిత్రపటానికి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయశంకర్ సార్ తెలంగాణ ఉద్యమ ప్రస్థానాన్ని వివరించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ విఠల్, కల్చరల్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ రాములు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# తల్లిపాలతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం

**నిర్మల్‌చైన్‌గేట్:** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలు దోహదపడతాయని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ సీపీ శారద పేర్కొన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసూతి ఆస్పత్రి సిబ్బంది సామాన్యులకు అర్థమయ్యేలా తల్లిపాల విశిష్టతను తెలుపుతూ ప్రదర్శించిన నాటిక అందరినీ ఆకట్టుకుంది. నర్సింగ్ కాలేజ్ మొదటి సంవత్సరం విద్యార్థినులు తల్లిపాల విశిష్టతను తెలుపుతూ ప్లకార్డుల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. పుట్టిన వెంటనే బిడ్డలకు ముర్రుపాలు పట్టించాలని, మొదటి ఆరునెలలు తల్లిపాలు మాత్రమే పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రసూతి ఆస్పత్రి హెచ్‌వోడీ సరోజ, ఆర్‌ఎంవో సమత, నర్సింగ్ పర్యవేక్షకురాలు ధనలక్ష్మి, నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మంజుల, పిల్లల వైద్య నిపుణులు వసు, ప్రదీప్ పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నర్సింగ్ సిబ్బంది

# విషజ్వరాల విజృంభణ



ఈ ఫొటోలోని బాలుడు అనాజ్ ఖాన్‌ది నేరడిగొండ మండలం వాంకిడి. ఇతను వారంరోజులుగా జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నాడు. కుటుంబసభ్యులు నాలుగురోజుల క్రితం వరకు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయినప్పటికీ జ్వరం, ఒళ్లు నొప్పులు తగ్గలేదు. దీనికి తోడు ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గుతూ వచ్చింది. రెండురోజుల క్రితం జిల్లా జనరల్ ఆస్పత్రిలో చేర్పగా చికిత్స కొనసాగుతోంది.



పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న బాధితులు

- జిల్లాలో ఇంటింటా బాధితులే
- దగ్గు, జలుబుతో ఇబ్బందులు
- ఒంటి నొప్పులతో ఉక్కిరిబిక్కిరి
- చాలామందిలో బ్లడ్ ఇన్‌ఫెక్షన్
- నియంత్రణ చర్యల్లో వైద్యశాఖ

**నిర్మల్‌చైన్‌గేట్:** జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఏ ఇంటా చూసినా జ్వర బాధితులే కనిపిస్తున్నారు. ఎక్కడికెళ్లినా వైరల్ ఫీవర్ల గురించే చర్చ నడుస్తోంది. చిన్నాపెద్ద తేడా లేకుండా అందరినీ సీజనల్ వ్యాధులు పట్టిపీడిస్తున్నాయి. జ్వరంతో పాటు ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు వచ్చి ఎంతకూ తగ్గడం లేదు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వానాకాలం ఆరంభమైన తర్వాత అపరిశుభ్ర వాతావరణం, వర్షపునీరు నిలిచి దోమలు విజృంభించి వ్యాధులకు కారణమవుతాయి. ఈ సీజన్‌లో చాలామందికి జలుబు, దగ్గు, జ్వరం వస్తుంటాయి. అయితే ఈసారి మాత్రం విచిత్ర పరిస్థితి కనిపిస్తోంది. వైద్యులు కూడా జ్వరపీడితులు చెప్పే లక్షణాలు చూసి విస్తుపోతున్నారు. సాధారణంగా ఇచ్చే యాంటీ బయోటిక్స్‌కు జ్వరాలు తగ్గడంలేదు. దీంతో ఎక్కువ డోస్ ఉన్న మందులు రాస్తున్నారు.



చిన్నపిల్లల డాక్టర్ గది ముందు బాధితులు

బాధితుల్లో చాలామంది బ్లడ్ ఇన్‌ఫెక్షన్, ఒంటి నొప్పులు, దగ్గు, జలుబుతో ఇబ్బంది పడుతున్నారు. ఒకేసారి అన్నిరకాల సమస్యలు చుట్టుముట్టడంతో జనం భయాందోళనకు గురవుతున్నారు.

**వారంరోజుల్లోనే పెరిగిన బాధితులు**

జ్వర బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వారం రోజులుగా వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా పట్టణం, పల్లె అనే తేడా లేకుండా దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. విరోచనాలు, మలేరియా, డెంగీ లాంటి సీజనల్ వ్యాధులతో జనం బాధ పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జిల్లా ప్రభుత్వాస్పత్రికి వారం క్రితం వరకు వెయ్యిలోపు ఓపీ ఉండగా ప్రస్తుతం సంఖ్య ఎక్కువైంది. మంగళవారం ఒక్కరోజే 1,400 మంది జ్వరపీడితులు ఆస్పత్రికి వచ్చారు.

### పెరిగిన 'ప్రైవేట్' దోపిడీ

పీహెచ్‌సీల్లో డెంగీ కిట్లు అందుబాటులో లేక పోవడం ప్రైవేట్ ఆస్పత్రులకు వరంగా మారింది. జ్వరాల బారిన పడిన పలువురు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన యాజమాన్యాలు ఒక్కో టెస్ట్‌కు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరిన జ్వర పీడితుల నుంచి టెస్టులు, మందులు, చికిత్స పేరిట అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


**ఆరోగ్యశాఖ అప్రమత్తం**

సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది జిల్లాలో విషజ్వరాలు, వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతీ శుక్ర, మంగళ వారాల్లో డ్రైడే పాటించేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలను అప్రమత్తం చేస్తూ ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.

**జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఓపీ వివరాలు**

| తేదీ | ఓపీ సంఖ్య |
|---|---|
| జూలై 30 | 1,130 |
| జూలై 31 | 950 |
| ఆగస్టు 1 | 1,360 |
| ఆగస్టు 2 | 1,200 |
| ఆగస్టు 4 | 1,350 |
| ఆగస్టు 5 | 1,400 |


### పరిసరాల పరిశుభ్రతే ప్రధానం



పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను కట్టడి చేయొచ్చు. ముఖ్యంగా డయేరియా, విషజ్వరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. పరిశుభ్రమైన నీరు తాగాలి. అప్పుడే వండిన ఆహార పదార్థాలు తినాలి. దోమలు కుట్టకుండా ఏర్పాట్లు చేసుకోవాలి. జ్వరం వచ్చి రెండు రోజులైనా తగ్గకుంటే వైద్యులను సంప్రదించాలి.

– దయాకర్ యాదవ్, జనరల్ ఫిజీషియన్, జిల్లా జనరల్ ఆస్పత్రి

### జాగ్రత్తలతో వ్యాధులు దూరం



ప్రస్తుతం పిల్లలు జ్వరం, వాంతులు, డయేరియా బారిన పడుతున్నారు. రోజుకు 150 దాకా ఓపీ ఉంటోంది. సరైన సమయంలో వచ్చినవారు త్వరగా కోలుకుంటున్నారు. వైద్యులు, సిబ్బంది, మందులు అందుబాటులో ఉన్నాయి. పరిసరాల పరిశుభ్రతపై జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్ వ్యాధులు దరిచేరవు.

– వసుకుమార్, చిన్నపిల్లల వైద్యుడు, జనరల్ ఆస్పత్రి

## క్లుప్తంగా

### దాడి కేసులో నిందితుడి అరెస్ట్

**రామకృష్ణాపూర్:** రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్‌లో గత నెల సంతోష్ అనే వ్యక్తిపై కత్తులు, కర్రలతో దాడికి పాల్పడిన ఘటనలో పరారీలో ఉన్న బొల్లం ఆంజనేయులును బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు కాగా ఇద్దరిని గత నెలలోనే రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

### పోక్సో కేసులో మూడేళ్ల జైలు

**చెన్నూర్:** మండలంలోని శివలింగాపూర్ గ్రామానికి చెందిన అంబులెన్స్ డ్రైవర్ కాటెల కృష్ణస్వామి బాలికను వేధింపులకు గురిచేసిన ఘటనలో జిల్లా అదనపు జడ్జి ఎల్.శ్రీనివాస్ నాయక్ నిందితునికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.1500 జరిమానా, బాధితురాలికి రూ.లక్ష నష్టపరిహారం ఇప్పించాలని బుధవారం తీర్పునిచ్చినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపారు. 2019, జూలై 17న కృష్ణస్వామి పదో తరగతి చదువుతున్న బాలికను సాయంత్రం 5 గంటల ప్రాంతంలో బలవంతంగా స్కూటీపై తీసుకెళ్లి లైంగికంగా వేధించాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ ప్రమోద్‌రావు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

### ఇద్దరి బైండోవర్

**కుంటాల:** మండలంలోని రాజాపూర్‌తండా కంపార్ట్ మెంట్ 1042లో 6 ఎకరాలు కబ్జాచేసి పత్తి సాగు చేస్తున్న ఇద్దరిని బుధవారం తహసీల్దార్ కమల్ సింగ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎఫ్ఆర్వో రాథోడ్ రమేశ్ తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తండాకు చెందిన రాథోడ్ రాం, పవార్ సేవగ్ గత జూన్ మాసంలోనే భూకబ్జాకు పాల్పడడంతో కేసులు నమోదు చేశామన్నారు. ఇటీవల పత్తి పంట సాగు చేయడంతో బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. మళ్లీ అటవీ భూమిని సాగుచేస్తే ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానా విధించనున్నట్లు తెలిపారు. డీఆర్వో రేష్మ, ఎఫ్‌బీవో హరిలత పాల్గొన్నారు.

### పేకాడుతున్న ఐదుగురిపై కేసు

**తలమడుగు:** మండలంలోని కోసాయి గ్రామ శివారులో బుధవారం పేకాడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాధిక తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి రూ.1,100 లభ్యం కావడంతో సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### గుడుంబా విక్రేతపై..

**తలమడుగు:** మండలంలోని కోసాయి గ్రామ శివారులో గుడుంబా విక్రయిస్తున్న సీడం మాధవరావుపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాధిక తెలిపారు. కోసాయి గ్రామానికి చెందిన మాధవరావు గుడుంబా విక్రయిస్తుండగా పట్టుబడినట్లు ఆమె పేర్కొన్నారు.

### డ్రైవర్స్ కాలనీలో చోరీ

**ఆదిలాబాద్‌రూరల్:** ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డ్రైవర్స్ కాలనీలో బుధవారం తెల్లవారుజామున మూడిళ్లలో చోరీ జరిగినట్లు ఏఎస్సై మారుతి తెలిపారు. కాలనీలో వరుసగా ఉన్న షేక్ అఫ్రోజ్, షాబానా, షేక్ ఫారూఖ్ నివాసాల్లో చోరీకి పాల్పడినట్లు పేర్కొన్నారు. నగదుతో పాటు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వాటి విలువ రూ.77వేల వరకు ఉంటుందన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

### విధులను ఆటంకపర్చిన ముగ్గురిపై కేసు

**ఆదిలాబాద్‌టౌన్:** ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ ఆర్ ఎస్సై మహేందర్ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. అటువైపు నుంచి వస్తున్న యూసుఫ్ వాహనాన్ని ఆపి డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేస్తుండడంతో నిరాకరించి పోలీసులతో వాగ్వివాదానికి దిగాడు. అతనికి షన్ను, అస్లమ్ మద్దతు తెలిపారు. దీంతో ఆర్ఎస్సై మహేందర్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

### ఆధార్ ఆధారిత హాజరు నుంచి మినహాయించాలి

**మంచిర్యాలటౌన్:** క్షేత్రస్థాయిలో పనిచేసే ఏఎస్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, హెల్త్ అసిస్టెంట్లతో పాటు ప్రతిరోజు పర్యటనలు చేసే పర్యవేక్షణ సిబ్బందికి అబాస్(ఆధార్ ఆధారిత హాజరు) నుంచి మినహాయించాలని కోరుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా పారా మెడికల్ సిబ్బంది, ఐక్యవేదిక చైర్మన్ జగదీశ్, ప్రధాన కార్యదర్శి శంకర్, కన్వీనర్ అల్లాడి శ్రీనివాస్, కోశాధికారి నాందేవ్, జేఏసి నాయకులు రమేశ్, పద్మ, వసుమతి పాల్గొన్నారు.

### రక్తదానానికి ముందుకు రావాలి

**మంచిర్యాలటౌన్:** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని బ్లడ్‌బ్యాంకులో రక్తనిల్వలు పూర్తిగా తగ్గిపోయాయి. తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు రక్తం ఎక్కించేందుకు ఇబ్బందిగా ఉందని, రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి అన్నారు. జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ ఉత్తంను రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు బుధవారం కలిసి శిబిరం నిర్వహించాలని కోరారు.

# భోరజ్ అక్రమాలకు 'చెక్'!

- అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల ఎత్తివేతకు రంగం సిద్ధం
- అవినీతి, ఆరోపణల నేపథ్యంలో సర్కారు నిర్ణయం


భోరజ్ చెక్‌పోస్టు (ఫైల్)

**సాత్నాల:** భోరజ్ సమీకృత చెక్‌పోస్టు ఎత్తివేతకు రంగం సిద్ధం అయినట్లు తెలుస్తోంది. అవినీతి, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను తొలగించేందుకు ప్రభుత్వం ఇటీవల చర్యలు షురూ చేసింది. ఈ మేరకు త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు సమాచారం. ఈ చెక్‌పోస్టులపై తీవ్రస్థాయిలో ఆరోపణలతో పాటు ఏసీబీ తనిఖీల సమయంలో పట్టుబడిన నగదుకు సంబంధించిన వివరాలు, లెక్కపత్రాలు అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. ప్రతీసారి తనిఖీ చేసిన సమయంలో వేలల్లో పట్టుబడుతున్నాయి. అయితే ఆ డబ్బుతో తమకు సంబంధం లేదని అధికారులు చేతులెత్తేయడం, అనంతరం అక్రమ దందా యథాతథంగా సాగుతుండం ఇక్కడ షరా మామూలే. గతంలో డ్యూటీ, డబ్బుల విషయంలో గొడవలు జరగగా, ఆ పంచాయితీ ఉన్నతాధికారుల వద్దకు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చెక్‌పోస్టులను ఎత్తివేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. వారం రోజుల్లో దీనికి సంబంధించి ఉత్తర్వులు జారీ కానున్నట్లు సమాచారం. అయితే ఈ చెక్‌పోస్టును ఎత్తివేస్తే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలపై నిఘా కొరవడే అవకాశం లేకపోలేదు. ఆన్‌లైన్‌లోనే ఫిట్‌నెస్, ఇతర పర్మిట్‌లను జారీ చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధంగానే కేంద్ర ప్రభుత్వం వాహన సారధి అనే యాప్‌ను అనుసంధానం చేయనున్నట్లు చెబుతున్నారు.

**అక్రమాలకు అడ్డా..**

భోరజ్ చెక్‌పోస్టు అనేక అక్రమాలకు అడ్డాగా మారిందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం వేలాది వాహనాలు దీని గుండా రాకపోకలు సాగిస్తాయి. ఓవర్‌లోడ్, పర్మిట్ లేకపోవడం, ఫిట్‌నెస్ సమస్య, డ్రైవర్లకు లైసెన్సు తదితర అనేక అంశాలపై వాహనాలను ఇక్కడ తనిఖీ చేస్తుంటారు. ఈ చెక్‌పోస్టు 24 గంటల పాటు కొనసాగుతుంది. అయితే ఇందులో నలుగురు ఎంవీఐలు, ఆరుగురు ఏఎంవీఐలు, ఒక హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు, అటెండర్లు, నలుగురు హోంగార్డులు, ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్లు మొత్తం 20 మంది వరకు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇంతవరకూ బాగానే ఉన్నా నిబంధనలు పాటించని వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనేది బహిరంగ రహస్యం. ఇందుకోసం చెక్‌పోస్టులో ఓ డబ్బాను సైతం ఏర్పాటు చేశారని, వసూళ్ల కోసం ప్రైవేట్ వ్యక్తులను కూడా నియమించుకున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఈ వ్యక్తుల వద్దనే డబ్బులు జమచేసి అధికారులు వాటా తీసుకుంటారని ప్రచారం ఉంది. నిబంధనల ప్రకారం.. వాహనదారులు చెల్లించే డబ్బులు తక్కువగా ఉంటాయి. అయితే ఏసీబీ తనిఖీల సమయంలో లెక్కకు తేలని వేలాది రూపాయలు ఉండటం అంతుచిక్కని విషయం. గతేడాది డిసెంబర్ 4న భోరజ్ చెక్‌పోస్టును ఏసీబీ అధికారులు తనిఖీ చేశారు. ఈ సమయంలో లెక్కకురాని రూ.62,500 నగదును స్వాధీనం చేసుకోవడం గమనార్హం. లెక్కకురాని డబ్బులను పైస్థాయి నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు వాటాలు పంచుకుంటారనే ఆరోపణలున్నాయి. ప్రైవేట్ వ్యక్తులకు ఏరోజుకారోజు డబ్బులు చెల్లిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ చెక్‌పోస్టును తొలగించడమే ఉత్తమమని ప్రభుత్వం నిర్ణయించినట్లుగా తెలుస్తోంది.

**కొరవడనున్న నిఘా..**

భోరజ్ చెక్‌పోస్టుపై అవినీతి, ఆరోపణలను పక్కనబెడితే దీనిని తొలగిస్తే నిఘా కొరవడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి ఆదిలాబాద్ మీదుగా వెళ్లే వాహనాలకు పర్యవేక్షణ కరువవుతుంది. ప్రస్తుతం ఈ చెక్‌పోస్టు మీదుగా వెళ్లే వేలాది వాహనాలను 24 గంటల పాటు తనిఖీ చేస్తున్నారు. ఓవర్‌లోడ్, పత్రాలు లేకపోవడం, పర్మిట్లు, అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా చర్యలు చేపడుతున్నారు. చెక్‌పోస్టును ఎత్తివేస్తే వీటన్నింటిపై నిఘా కొరవడనుంది. రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయం సైతం తగ్గనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ సిబ్బందిని తనిఖీ అధికారులుగా నియమించినప్పటికీ 24 గంటల పాటు పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టే అవకాశం కనిపించడం లేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. కాగా ఆన్‌లైన్‌లోనే పర్మిట్లు, ఇతర పత్రాలను పరిశీలించనున్నారు. ఇందుకోసం వాహన సారధి యాప్‌ను అమలులోకి తీసుకొస్తారని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. చెక్‌పోస్టు ఎత్తివేత విషయమై మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో చెక్‌పోస్టు ఎత్తివేస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన జీవో విడుదల కావాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు.

### పరిహారం చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఫారెస్టు అధికారులు

**లక్సెట్టిపేట:** జెండావెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తలమల గ్రామ అటవీ శివారులో ఈ నెల 5న చిరుతపులి దాడిలో లేగదూడ మృతి చెందింది. అటవీశాఖ ఆధ్వర్యంలో బుధవారం యజమాని పూసం లచ్చుకు రూ.12 వేల పరిహారం చెక్కును ఒక్కరోజులోనే అందజేసినట్లు రేంజి అధికారి అనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ అల్తాఫ్, ఎఫ్‌బీవో చంద్రశేఖర్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### 8న ఆర్జీయూకేటీలో ఐదోవిడత కౌన్సెలింగ్

**బాసర:** ఆర్జీయూకేటీ బాసర, మహబూబ్‌నగర్ కేంద్రాలకు సంబంధించిన స్పోర్ట్స్, ఎన్‌సీసీ, జనరల్ కోటా అభ్యర్థులకు ఈనెల 8న ఐదోవిడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు బుధవారం ప్రకటించారు. ఉదయం 9 గంటలకు ప్రక్రియ ప్రారంభమవుతుందని, అర్హత పొందిన అభ్యర్థులు నిజధ్రువీకరణ సర్టిఫికెట్లు, అవసరమైన పత్రాలతో నిర్ణీత సమయానికి హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్ www.rgukt.ac.in ను సందర్శించాలన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

**రామకృష్ణాపూర్:** పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన 8వ సబ్ జూనియర్ ఆత్య-పాత్య జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన ఏడుగురు బాలురు, ఏడుగురు బాలికలను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ నెల 10న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో అత్యా-పత్యా జిల్లా అధ్యక్షుడు గాండ్ల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి ఉప్పలయ్య, కనపర్తి రమేశ్, సంతోష్, దేవేందర్, వర్ష, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సీఆర్టీల డెమో ప్రక్రియ


డెమో ప్రక్రియ పరిశీలిస్తున్న పీవో

**ఉట్నూర్‌రూరల్:** మండల కేంద్రంలోని పీఎంఆర్సీ భవనంలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీఆర్టీ అభ్యర్థుల డెమో ప్రక్రియ సజావుగా ముగిసిందని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తెలిపారు. బుధవారం డెమో ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ 6 గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీఆర్టీ పోస్టులను భర్తీ చేసేందుకు డెమో ప్రక్రియ నిర్వహించినట్లు తెలిపారు. 96 మంది అభ్యర్థులకుగానూ 90 మంది హాజరైనట్లు తెలిపారు. తుది జాబితాను ప్రకటించి ఖాళీగా ఉన్న పోస్టులలో నియామక ప్రక్రియ చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ టీడబ్ల్యూ అంబాజీ, ఆసిఫాబాద్ డీడీటీడబ్ల్యూ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

### అదుపుతప్పి ఆటో బోల్తా..

- మహారాష్ట్ర కూలీలకు గాయాలు


క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

**కుంటాల:** అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో మహారాష్ట్రకు చెందిన పదిమంది కూలీలకు గాయాలయ్యాయి. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన దత్తనగర్ తండాకు చెందిన కూలీలు వరినాట్లు వేసేందుకు బుధవారం ఆటోలో కుంటాలకు బయలుదేరారు. దౌనెల్లితండా వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటో డ్రైవర్ ఇందల్‌తో పాటు కూలీలు జీవంత్‌రావు, రాథోడ్ కవితరాం, శాంతాబాయి, శేషారావు, లక్ష్మి, లత, పూర్ణిమ, సక్కుబాయికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్సకోసం నిజామాబాద్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

### లారీ బోల్తా


బోల్తా పడిన లారీ

**తాంసి:** మండలంలోని బండల్‌నాగాపూర్, పొచ్చర గ్రామాల మధ్య బుధవారం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పొచ్చెర గ్రామం నుంచి తాంసి మండలంలోని కప్పర్ల వరకు నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డంతా బురదమయంగా మారింది. బుధవారం ఇదే రోడ్డుపై వచ్చిన లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### పాము కాటుకు యువతి మృతి


మడే రమాదేవి మృతదేహం

**దహెగాం:** పాము కాటుకు యువతి మృతి చెందిన సంఘటన మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన లోహాలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మడే రమాదేవి (22) బుధవారం వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చింది. వేడి నీళ్లు పెట్టుకోవడానికి ఇంటివద్ద ఉన్న పొయ్యిల కట్టెలను తీస్తుండగా చేతికి పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అంబులెన్సు బెజ్జూర్ నుంచి రావడానికి ఆలస్యం అవుతుందని ద్విచక్ర వాహనంపై కుంచవెల్లి మీదుగా పీపీరావు కాలనీ వరకు వచ్చారు. దహెగాం అంబులెన్సు పీపీరావు కాలనీ వరకు వెళ్లి మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

**పిడుగుపాటుకు ఒకరు..**

**కౌటాల:** పిడుగుపాటుతో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని పార్డీ గ్రామానికి చెందిన కుడ్మెత శంకర్ (60) బుధవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మార్గమధ్యలో పిడుగు వేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.

### ప్రియుడి మోసం వల్లే యువతి ఆత్మహత్య

**ఆదిలాబాద్‌టౌన్:** ఉట్నూర్ మండలం గంగన్నపేటకు చెందిన మౌనిక(24)ను ప్రియుడు మోసం చేయడం వల్లే ఆత్మహత్య చేసుకుందని వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. గత రెండేళ్ల క్రితం భర్తతో విడాకులు తీసుకుని ఆదిలాబాద్‌లోని ఖుర్షీదాపూర్‌లో అద్దె ఇంట్లో ఉంటోందని తెలిపారు. రెండేళ్లుగా ఆదిలాబాద్‌లోని సూపర్‌మార్కెట్‌లో పని చేస్తుండగా.. అదే మార్కెట్‌లో పని చేసే బంగారుగూడకు చెందిన గణేష్‌తో ప్రేమ వ్యవహారం సాగుతోందని పేర్కొన్నారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేయడంతో మనస్తాపం చెందిన మంగళవారం ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

### పర్వతారోహణకు కార్తీక్

- ఈ నెల 9నుంచి మౌంట్ యూనమ్‌కు సాహస యాత్ర


శంషాబాద్ ఎయిర్‌పోర్టులో జెండా చూపిస్తున్న గిత్తే కార్తీక్

**కెరమెరి:** కుమురంభీం జిల్లా కెరమెరి మండలంలోని కెలికే గ్రామానికి చెందిన గిత్తే కార్తీక్ ఈ నెల 9 నుంచి 19 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని స్పీటీవ్యాలీలో నిర్వహించనున్న మౌంట్ యూనమ్ పర్వతారోహనకు బుధవారం బయలుదేరి వెళ్లాడు. 9 నుంచి పర్వతా రోహణ ప్రారంభించనున్నాడు. సాహస యాత్ర 6,111 మీటర్ల ఎత్తు ఉన్న మౌంట్ యూనం వరకు శిఖరోహణ కొనసాగుతుంది. సుమారు పది రోజులపాటు కొనసాగే ఈ సాహస యాత్రకు సికింద్రాబాద్‌కు చెందిన గ్లోబల్ హిందూ ఫెడరేషన్, ఛత్రపతి శివాజీ మహరాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోతే ప్రత్యామ్నాయంగా మౌంట్ కానామో శిఖరంతో మార్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### బీఈడీలో ప్రవేశ గడువు పొడిగింపు

**ఉట్నూర్‌రూరల్:** ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బీఈడీ కళాశాలలో 2025-27 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి గానూ దరఖాస్తు గడువును ఈ నెల 8 నుంచి 14 వరకు పొడిగించినట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కౌన్సెలింగ్ తేదీ ఈనెల 14 నుంచి 21వ తేదీకి మార్చినట్లు ఆమె పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### అసభ్యకర పోస్టులు పెడుతున్న ఒకరి అరెస్టు


నిందితుడిని చూపుతున్న సీఐ అశోక్, ఎస్సై

**నస్పూర్:** చిన్నారుల అసభ్యకరమైన వీడియోలను ఇన్‌స్టాగామ్‌లో షేర్ చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ తెలిపారు. బుధవారం ఆయన సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ తాళ్లపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన కర్రు సందీప్ చిన్నారుల అసభ్యకరమైన వీడియోలను షేర్ చేస్తుండడంతో నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లోయిటెడ్, సైబర్ సెక్యురిటీ సహకారంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. సమావేశంలో ఎస్సై ఉపేందర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

### టీఎంసీకి షోకాజ్ నోటీసు జారీ

**చెన్నూర్:** చెన్నూర్ మున్సిపాల్టీ మెప్మా టౌన్ మిషన్ కోఆర్డినేటర్(టీఎంసీ) రామకృష్ణకు బుధవారం జిల్లా అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. టీఎంసీ వేధింపులకు గురిచేస్తున్నారని చెన్నూర్ మెప్మా సభ్యులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. స్పందించిన అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. షోకాజ్ నోటీసులపై మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ ఆర్పీలను కార్యాలయానికి పిలిచి విలేకరులకు తమ విషయం చెప్పలేదని రాసివ్వాలని ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలిసింది. ఇదే విషయమై గురువారం ఆర్పీలతో కమిషనర్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం.

## 'పోడు'పై హక్కుల కోసం పాదయాత్ర



పాదయాత్ర చేపట్టిన దిందా గ్రామస్తులు

**చింతలమానెపల్లి:** పోడు భూములపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని దిందా గ్రామస్తులు బుధవారం పాదయాత్ర ప్రారంభించారు. పోడు భూముల సాధన ర్యాలీ పేరుతో హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు బయలు దేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ శివారులో ఉన్న భూముల్లో దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అటవీశాఖ అధికారులు వేధింపులకు గురిచేస్తూ భూములను లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఆవేదనను రాజధానిలో తెలియజేసేందుకు పాదయాత్రగా బయలుదేరామన్నారు. తమ సమస్యకు పరిష్కారం లభించేంత వరకు పోరాడుతామన్నారు.

## సైబర్ మోసం

- రూ.3.82 లక్షలు కోల్పోయిన బాధితుడు
- వన్‌టౌన్‌లో ఫిర్యాదు

**ఆదిలాబాద్‌టౌన్:** సైబర్ మోసగాళ్లు రోజురోజుకు కొత్త పుంతలు తొక్కుతున్నారు. ఇప్పటికే ఎంతో మంది సైబర్ వలలో పడి ఆర్థికంగా నష్టపోయారు. మోసపోయేవారు ఉంటే.. మోసం చేసేవారికి కొదువ లేనట్టుగా ఇంకా చాలామంది సైబర్ నేరగాళ్ల చేతిలో మోసానికి గురవుతున్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా సంఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఆదిలాబాద్ పట్టణంలోని మోచిగల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ సాయినాథ్ సెల్‌ఫోన్‌కు గత నెల 12న ఓ లింక్ వచ్చింది. దాన్ని ఓపెన్ చేయగా పెట్టుబడి పెడితే రెండింతలు అవుతాయని చెప్పారు. దీంతో మొదట రూ.లక్ష పెట్టుబడి పెట్టాడు. వీటిని డ్రా చేసుకోవడానికి మరో రూ.లక్ష 17వేలు మళ్లీ వారికి పంపించాడు. దీంతో లింక్ యాప్‌లో రూ.9.20 లక్షలు చూపెట్టింది. ఈ డబ్బులు అకౌంట్లో మాత్రం జమ కాలేదు. దీంతో బాధితుడు మళ్లీ లింక్ ఓపెన్ చేయడంతో డ్రా చేసుకోవాలంటే ఇందులో రూ.24లక్షలు జమ చేయాలని సూచించారు. అనుమానం వచ్చిన బాధితుడు తాను మోసపోయినట్లు గ్రహించి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. సీఐ సునీల్‌కుమార్ కేసు నమోదు చేశారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ చేపట్టాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు


సుష్మాస్వరాజ్, ప్రొ.జయశంకర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న రాంచందర్‌రావు

**కాగజ్‌నగర్‌టౌన్:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై సీబీఐ విచారణ చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రూ.లక్ష కోట్ల ప్రజాధనం ఖర్చు పెట్టి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టు ఆయకట్టులో ఎన్ని ఎకరాలకు సాగు నీరందుతుందని, ఎంతమంది రైతులకు లబ్ధి చేకూరిందని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టును బీఆర్ఎస్ పార్టీ ఏటీఎం లాగా వాడుకుందని ఆరోపించారు. ఘోష్ ప్యానల్ నివేదిక ప్రకారం అవినీతి జరిగిందని స్పష్టమైందని, కేసీఆర్ కుటుంబం కోట్లాది రూపాయలు ప్రజాధనాన్ని వ్యర్థం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ చేయకుండా కాంట్రాక్టర్లు, నాయకులతో కుమ్మక్కై వెనుకంజ వేస్తోందని ఆరోపించారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో 2.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందాలంటే తుమ్మిడిహెట్టిలోని వార్ధా, పెన్‌గంగ నదుల సంగమం వద్ద కొత్త ప్రాజెక్టు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, మాజీ ఎంపీ వెంకటేశ్ నేత తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్‌లపై బీజేపీ వైఖరి ప్రకటించాలి

**పాతమంచిర్యాల:** బీసీ రిజర్వేషన్‌లపై బీజేపీ తన స్పష్ట మైన వైఖరిని ప్రకటించాలని తెలంగాణ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కోశాధికారి వనం సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీల రిజర్వేషన్‌లపై ఆ పార్టీ నాయకులు తలోమాట మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణకు చెందిన ఒక బీజేపీ ఎంపీ మంత్రి పదవుల్లో రిజర్వేషన్‌లు కావాలని, రాష్ట్ర అధ్యక్షుడు షెడ్యూల్ 9 లో చేర్చడం సాధ్యం కాదని, మరో కేంద్ర మంత్రి ముస్లింలకు వ్యతిరేకంగా మాట్లాడతాడన్నారు. క్రమశిక్షణ గల పార్టీలో ఉన్న వారు ఇలా మాట్లాడడం సమంజసమేనా? అని ప్రశ్నించారు. గతంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నల్లచట్టాల విషయంలో మడమ తిప్పారని, ఇటీవల పాకిస్తాన్‌తో యుద్ధం ప్రకటించారని గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా చేపట్టిన ఉద్యమాలకు తలొగ్గి బీసీ కుల గణనకు ఆర్డినెన్సు జారీ చేశారని, షెడ్యూల్ 9లో చేర్చకుండా తప్పించుకోలేరన్నారు.

### కమిషనర్, కాంట్రాక్టర్‌కు మధ్య వాగ్వాదం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంట్రాక్టర్

**చెన్నూర్:** చెన్నూర్ మున్సిపల్ కమిషనర్, కాంట్రాక్టర్‌కు మధ్య బుధవారం వాగ్వాదం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ రత్న సునీల్‌రెడ్డి పట్టణంలోని పలు వార్డుల్లో రూ.16 లక్షల నిధులతో సీసీరోడ్లు నిర్మించారు. రోడ్ల నిర్మాణం పట్ల క్వాలిటీ కంట్రోల్ క్లీన్ సర్టిఫికెట్ ఇచ్చింది. సదరు పనులకు బిల్లు చెల్లింపునకు కమిషనర్ కలెక్టర్‌కు కవరింగ్ లెటర్ పంపించాల్సి ఉంటుంది. కానీ కమిషనర్ మురళీకృష్ణ కవరింగ్ లెటర్ పంపించకుండా మూడు నెలలుగా జాప్యం ప్రదర్శిస్తున్నాడు. సదరు కాంట్రాక్టర్ బుధవారం కార్యాలయానికి వెళ్లి కవరింగ్ లెటర్ పంపించాలని అడగడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇరువురు తీవ్ర స్థాయిలో ఘర్షణకు దిగడంతో సిబ్బంది జోక్యం చేసుకుని కాంట్రాక్టర్‌ను కార్యాలయం నుంచి బయటకు తీసుకువచ్చారు.

**పరస్పరం ఫిర్యాదులు...**

కమిషనర్ అసభ్య పదజాలంతో దూషించాడని, బిల్లు మంజూరు కోసం పర్సంటేజీ డిమాండ్ చేస్తున్నాడని కాంట్రాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కాంట్రాక్టర్ అకారణంగా దూషించాడని కమిషనర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను వివరణ కోరగా మున్సిపాలిటీ పరిధిలో రూ.16 లక్షల నిధులతో చేపట్టిన రోడ్డు పనులకు బిల్లులు ఇవ్వాలని కోరితే కమిషనర్ 5 శాతం పర్సంటేజీ డిమాండ్ చేస్తున్నాడన్నారు. ఇవ్వలేనని చెప్పడంతో మూడునెలలుగా తిప్పించుకుంటున్నాడన్నారు. బిల్లు అడిగితే ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకొమ్మని బెదిరిస్తున్నాడన్నారు. కమిషనర్ తీరుపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. ఈ విషయమై కమిషనర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.